క్లుప్తంగా

సన్మానం



డీకే అరుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

షాద్‌నగర్: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను మంగళవారం షాద్‌నగర్ బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్‌లోని కలాంబిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నేతల సమావేశానికి షాద్‌నగర్ నుంచి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యల ఆధ్వర్యంలో నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా డీకే అరుణను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, కమ్మరి భూపాలాచారి, మహబూబ్‌నగర్ కో–కన్వీనర్ అమడాపురం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: దివ్యశక్తి పేపర్ పరిశ్రమ ఆధ్వర్యంలో కొందుర్గు బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సునీల్ బురాన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం ప్రతి వేసవి సమయంలో కొందుర్గు బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. చలివేంద్రాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు సతీశ్, శ్రీనివాస్, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు రామయ్యగౌడ్, రామస్వామి పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవునిగడ్డ, వెంకమ్మగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు టీకాలు, వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

విధుల్లో అప్రమత్తత తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

కేశంపేట: వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, రోగులకు సకాలంలో సేవలు అందించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆమె వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్‌తో పాటు రోగులకు మందులను సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, హెచ్‌ఈ శ్రీనివాస్‌లు, హెచ్‌ఈఓ ఆంజనేయులు, ఉపేందర్ రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పంటకు మేలు వేసవి దుక్కులు

సకాలంలో విత్తనాలు వేసుకునే అవకాశం

- తప్పనున్న చీడపీడల బెడద
- మెరుగైన దిగుబడికి అవకాశం



షాబాద్‌లో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

షాబాద్: పంటసాగు పూర్తయ్యాక వేసవిలో భూములు ఖాళీగా ఉంటాయి. ఈ సమయంలోనే భూసారం పెరిగేలా సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నీటి వసతి ఉన్న భూములు తప్పా వర్షాధారంగా పండించే భూములు వేసవిలో ఖాళీగా ఉంటాయి. తొలకరి వర్షాలు కురిసే నాటికి భూమిని లోతుగా దున్ని దుక్కులు చేసుకోవడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. దుక్కులు చేయడంతో భూమిపై పొరలు లోపలికి, లోపలి పొరలు భూ ఉపరితలానికి చేరుతాయి. వీటితో పంట దిగుబడి పెరుగుతుంది. వానాకాలం పంటలో తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో చేపట్టాల్సిన పనులపై షాబాద్ వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

అధిక దిగుబడికి మార్గం..

వేసవి కాలం దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న చేనులో ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దుక్కులు దున్నాలి. సుమారు 9 అంగుళాలకు తగ్గకుండా దుక్కులు దున్నుకోవాలి. లోతు దుక్కులు దున్నినప్పుడు నేలపై పొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను ఆశించే పురుగులు చనిపోయే అవకాశం ఎక్కువ ఉండడంతో పాటు నేలలో దాక్కునే క్రిమికీటకాలు ఎండల బారినపడి నశిస్తాయి. దీంతో పంట సమయంలో పంటపై క్రిమికీటకాల ప్రభావం తక్కువ ఉండటంతో అధిక దిగుబడి వస్తుంది. దీంతో పాటు పంట పొలంలో కలుపు నివారించుకోవచ్చు. పొలంలో ఎక్కువగా తుంగ, గరిక, ఒలిపిడి వంటి కలుపు మొక్కలతో రైతులకు నష్టం ఏర్పడుతుంది. వేసవి దుక్కులు దున్నుకోవడంతో కలుపు మొక్కల వేర్లు కాయలు, దుబ్బలు పెకిలిపోయి బయటకు వచ్చి ఎండకి ఎండిపోతాయి. ఎండిపోయిన వేర్లు, కాయలు, దుంపలను ఏరివేస్తే మంచి ఫలితం ఉంటుంది. లోతు దుక్కులు చేసుకుంటే తొలకరి వర్షంలోనే విత్తనాలు విత్తుకునే పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పశువులు, గొర్రెల మందలు పెట్టడం..

గతంలో రైతులు ఎద్దులు, ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలను రాత్రిళ్లు పొలంలో మందలు పెట్టేవారు. పశువుల మలమూత్రాలతో సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఉపయోగపడేది. దీంతో రైతులకు ఎరువు ఖర్చు తక్కువగా ఉండేది. ప్రస్తుతం పశువులు తగ్గిపోవడంతో పంటలకు సేంద్రియ ఎరువు వాడకం తగ్గిపోతోంది. ప్రస్తుతం రైతులు వేసవికాలంలో పంట చేలు, పొలాల్లో గొర్రెల మంద, బర్రెల మందను వారం పదిరోజుల పాటు ఏర్పాటు చేసుకుంటే మంచి సేంద్రియ ఎరువు లభిస్తుంది.

అవగాహన కల్పించాలి..



వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. గ్రామసభలు నిర్వహించి సాగులో తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు రైతులకు తెలియజేయాలి. సాగులో మెళకువలపై అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు.

– చంద్రబాబు, రైతు, షాబాద్

మంచి ఫలితాలు వస్తాయి..



వేసవి దుక్కులతో వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోతుగా దుక్కులు దున్నుకునేందుకు ఆసక్తి చూపాలి. దీంతో పొలంలో ఉన్న చీడపీడలు నశించి పంట దిగుబడి పెరుగుతుంది. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– వెంకటేశం, వ్యవసాయాధికారి, షాబాద్

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని సీడీపీఓ నాగమణి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు పోత పాలను కాకుండా తల్లి పాలను ఇవ్వాలన్నారు. బిడ్డ జన్మించిన కొద్ది వ్యవధిలోనే ముర్రుపాలను పట్టించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గర్భిణులు పాలు, పండ్లు, ఆకు కూరలు, గుడ్లు వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు.పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే తల్లి, బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



ఆలయ నిర్వాహకులతో జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొల్లూరుగూడలో మల్లన్న, బీరప్ప బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవాల కోసం రూ.50వేల నగదును గ్రామస్తులకు విరాళం అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా మల్లన్న, బీరప్ప బోనాలు, కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు ఆలయాల వద్దకు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్

టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం, తదితరులు

షాద్‌నగర్: విద్యార్థులు చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం అన్నారు. మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసడక్, జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వే వారి ఆధ్వర్యంలో రూ.9.85లక్షలతో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీం మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తమవంతు సేవ చేయాలనే లక్ష్యంతో సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాయలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది విశ్వనాథ్ రాజు, బిజోయ్ బాబు, జగదీశ్, నరేశ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం జయమ్మ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మీర్‌పేట మాజీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఎంపీ టికెట్ ఎవరికి కేటాయించినా కాంగ్రెస్ గెలుపు కోసం అందరూ కలసికట్టుగా పనిచేద్దామన్నారు. సమావేశంలో బేర బాలకిషన్, అరవింద్ కుమార్, సరికొండ పాండు, మల్లేశ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, పల్లె పాండుగౌడ్, జెటావత్ రవినాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొని సోనియమ్మకు కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు రంజిత్‌రెడ్డికి మద్దతుగా తాము కూడా కాంగ్రెస్‌లో చేరుతామని తీగలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం తీసుకొస్తామన్నారు. చేవెళ్ల ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి సోనియా గాంధీకి కానుకగా ఇస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలంగాణ ఇచ్చిన పార్టీకే పట్టం కడతారన్నారు. ఎంపీ రంజిత్ రెడ్డి పార్టీలోకి చేరడంతో కాంగ్రెస్ మరింత బలంగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో మద్ది కరుణాకర్‌రెడ్డి, పరిగి రాఘవేందర్‌రెడ్డి, బోద జైపాల్ రెడ్డి, బొర్ర జగన్‌రెడ్డి, అంధ్యా నాయక్, వర్కల యాదగిరి గౌడ్, రాకేష్‌రెడ్డి, అరవింద్, బాలకిషన్, సదానంద్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

నియమావళి అతిక్రమిస్తే చర్యలు

ఎంపీడీఓ శైలజ



వాల్ రీడింగ్‌ను తొలగిస్తున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మహేశ్వరం ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. మంగళవారం అమీర్‌పేట్ గ్రామాన్ని సందర్శించి ఎన్నికల నియమావళి కోడ్ అమలులోకి వచ్చినందుకు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉండొద్దని వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. గోడలకు వాల్ రీడింగ్‌లను తుడిచివేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. రోడ్లపైన, ఇళ్ల మధ్యన చెత్తా, చెదారం ఉండకుండా శుభ్రం చేయించాలని కోరారు. అంతకుముందు పలు వార్డుల్లో తిరుగుతూ ఎన్నికల కోడ్ నియమావళి గురించి వివిధ పార్టీల నాయకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చక్రధర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న మల్లేశ్

నందిగామ: నాయీ బ్రాహ్మణులు ఐకమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలని ఆ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు మంగలి మల్లేశ్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేశ్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాయీ బ్రాహ్మణులందరూ ఏకతాటిపై ఉండాలని, ఏ సమస్య వచ్చినా సమష్టిగా పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. ఉపాధ్యక్షుడిగా మంగలి రవి, కార్యదర్శిగా మంగలి అశోక్, సభ్యులుగా వెంకటేశ్, లక్ష్మణ్, రాజు, సుధాకర్, రాంచంద్రయ్య తదితరులు ఎన్నికయ్యారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొందుర్గు: కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నందిగామలో మంగళవారం నిర్వహించిన కరాటే పోటీల్లో జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటింది. విద్యార్థిని అశ్విని అండర్ 12 కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు మాస్టర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీరాములుతో పాటు ఉపాధ్యాయులు ఖాదర్, కిషన్, వేణుకుమార్, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

ఇందిరమ్మ రాజ్యాన్ని నిర్మిస్తాం



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: తెలంగాణలో ఇందిరమ్మ కలలుగన్న రాజ్యాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నుష్రత్ రుక్సానా బేగం, గంట్లవెళ్లి మాజీ సర్పంచ్ కర్రోళ్ళ యాదమ్మ, మాజీ ఉపసర్పంచ్ సునీతతో పాటుగా, కేశంపేట మండలం బొదనంపల్లి గ్రామానికి చెందిన సుమారు 90 మంది నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ కలలుగన్న రాజ్యాన్ని నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, గూడ వీరేశం, బాలకృష్ణ, పాండు, చాకలి మల్లేశ్, సాయి, నర్సింహ్మా, రమేశ్, మహ్మద్‌ఖాజా, రాజ్‌గౌడ్, లయక్‌అహ్మద్, సయ్యద్‌గౌస్, రాములు, ఇబ్రహీం, అహ్మద్, శ్రీను నాయక్, రాజునాయక్, తులసీరాం, వజ్రలింగం తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం’

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని టీఎల్‌ఎఫ్ రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల గడ్డపై మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో గెలవడం ఖాయమన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఢిల్లీలో ప్రశ్నించేందుకు గులాబీ కండువా ఉండాలని, అందుకోసం లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. లోక్‌సభలో గళం విప్పాలంటే మనం ఎక్కువ ఎంపీ సీట్లు సాధించాలని, అందుకు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అందరికీ అన్నీ ఇస్తామని, ఇప్పుడు మాత్రం కొందరికి కొన్నే అంటుందని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ఇప్పటికీ రైతులు రైతుబంధు రాక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ వాటి ఊసే లేదన్నారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు!

- అమ్దాపూర్–శ్రీరామ్‌నగర్ రోడ్డు పూర్తయ్యేదెన్నడో?
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- త్వరగా పూర్తి చేయాలని వినతి



అమ్దాపూర్ రక్తమైసమ్మ ఆలయం సమీపంలో కంకరమయంగా రోడ్డు

మొయినాబాద్‌రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రోడ్డు పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నత్తనడకనా సాగుతున్నాయి కానీ ముందుకు సాగడం లేదు. కంకర వేసి వదిలేయడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇది అమ్దాపూర్– శ్రీరామ్‌నగర్ రోడ్డు దుస్థితి. మండల పరిధిలోని అమ్దాపూర్ రక్తమైసమ్మ ఆలయం నుంచి శ్రీరామ్‌నగర్ వరకు బీటీ రోడ్డు పనులను ప్రారంభించి కంకర వేశారు. బీటీ రోడ్డు వేయకపోవడంతో కంకరపై వాహనాదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం 2023 సెప్టెంబర్ నెలలో సీఆర్ఆర్ నిధులు అంచనా 3.50లక్షలతో అమ్దాపూర్ రక్తమైసమ్మ నుంచి శ్రీరామ్‌నగర్ వరకు రోడ్డు పనులను అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అప్పటి నుంచి రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి కానీ పూర్తి కాలేదని ఆయా గ్రామాలకు వెళ్లే వాహనాదారులు, రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అమ్దాపూర్ రక్తమైసమ్మ సమీపంలో భక్తులకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు. అమ్దాపూర్ రక్తమైసమ్మ నుంచి ఈ రోడ్డుపై శ్రీరామ్‌నగర్, వెంకటాపూర్, హైతాబాద్, షాబాద్ ఆయా గ్రామాలకు వాహనాదారులు అధికంగా ప్రయాణిస్తుంటారు. ప్రయాణికుల ఇబ్బందులను తెలుసుకొని ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రయాణికులకు, రైతులకు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.

త్వరలో పూర్తి చేయిస్తాం



మండల పరిధిలోని అమ్దాపూర్–శ్రీరామ్‌నగర్ రోడ్డు పనులు త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. అమ్దాపూర్ సమీపంలో గల రక్తమైసమ్మ ఆలయం నుంచి 800 మీటర్లు సీసీరోడ్డు వేసేందుకు ప్రతిపాదన చేశాం. అటు బీటీరోడ్డు పూర్తి కాగానే సీసీరోడ్డును కూడా వేయించేందుకు కృషి చేస్తున్నాం.

– విజయ్‌కుమార్, పీఆర్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్